# సింగిల్ పేజీ కథలు

తండ్రి దగ్గర నుండి వచ్చిన ఉత్తరం చదివి గోపీ కృష్ణ ఆశ్చర్యపోయాడు. రిటైరయ్యాక కూడా తండ్రులు ఈ రకంగా ఆలోచిస్తారా అంటే తనకే నమ్మశక్యం కావడం లేదు.

ఉమా! ఓసారిలా రా! భార్యని కేకేశాడు. వాళ్లిద్దరూ ఉదయం ఎనిమిది గంటలకే డ్యూటీలకి వెళ్లిపోవాలి. రాత్రి పొద్దుపోయే వరకూ తిరిగి రాలేరు. తండ్రి ఉత్తరం ఆఫీసులోనే అందుకున్నా చూడటమే కుదరలేదు.

ఏంటండీ అంత అర్జెంటు? ఆ ఉత్తరం ఎవరి దగ్గర నుండి? చేతిలో వంట పని వదిలి వచ్చింది.

నువ్వే చదువు, మీ మావయ్యగారి పురాణం! ఇచ్చేడు.

ఉమ అందుకుని గబగబా చదివింది.

మైడియర్ గోపీ! ఈ ఉత్తరాన్ని జాగ్రత్తగా చదువు. నీ భార్యతోనూ చర్చించు. నాకు సమాధానం ఒక వారంలోగా కావాలి. నేను రిటైరయి, ఒక సంవత్సరమే అయింది. స్టేట్ బ్యాంకులో ఆఫీసర్‌గా రిటైరయినా, ఆ రోజుకు నా సేవింగ్స్, పి.ఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌కేష్‌మెంట్ అన్నీ కలిపి- ఇంటిమీద అప్పు అదీ తీసేస్తే చేతికి ఎంత వచ్చిందో మీ ఇద్దరికీ తెలుసు. ఆ మిగిలిన ఆరు లక్షల్లోను నాలుగు లక్షలు అక్కకిచ్చేశాను, పెళ్లి సమయంలో ఇస్తానన్న డబ్బు బావగారికి ఇచ్చాను. చిల్లర మల్లర ఖర్చులు పోను ఎఫ్.డి.లో వేసింది లక్ష దాటలేదు. నాకొచ్చే పెన్షన్, మేడ మీద అద్దెకున్న వాళ్లిచ్చేది- రొటీన్ ఖర్చుకే సరిపోతుంది.

ఇంతకన్నా మీకేం ఖర్చులుంటాయి? అని నువ్వడగవచ్చు. అది నీకు, నీ రిటైర్మెంటయ్యాకే తెలుస్తుంది. ఇప్పుడు చెప్పినా నీ బుర్రకెక్కదు. నా సర్వీసులో ఎక్కువకాలం కష్టాలతోనే సరిపోయింది. నీ బీటెక్ సీటుకు డొనేషన్, ఇయర్లీ ఫీజులు- అప్పులు చేసే కట్టేను. నీ తమ్ముడు వంశీకి ఎం.బి.బి.ఎస్‌కి అయిన ఖర్చు లెక్కే లేదు. అప్పటికే నువ్వు జాబ్‌లో జాయినయినా వాడి చదువుకి నీ సహాయం ఏమీ అందలేదు. ఇక అక్క పెళ్లికి కట్నం రూపంలో ఇచ్చింది, నా రిటైర్మెంట్ బెనిఫిట్స్ లోంచే. పెళ్లి ఖర్చులు చూసుకోవడానికే కష్టమైపోయింది. దగ్గరవాడు గనుక, తర్వాత ఇచ్చే కండిషన్ మీద బావ ఒప్పుకున్నాడు.

ఇక ఉపోద్ఘాతం ఆపి పాయింట్‌లోకి వస్తాను. నాకిప్పుడు కనీసం ఆరు లక్షలు కావాలి. ఏం చేస్తారు? అని అడగొద్దు. నా ఆశయాలు అనంతం. కలలు కొల్లలు. వాటి వలననే మీకంత పెద్ద చదువులు! విదేశాలకు వెళ్లే అదృష్టం లేకపోయినా కనీసం దేశంలోని ముఖ్య ప్రదేశాలూ చూడలేదు. పుణ్యక్షేత్రాలు సరేసరి. విశాఖకు దగ్గరున్న సింహాచలం, తిరుపతి తప్ప విజయవాడ కనకదుర్గమ్మనూ దర్శించలేదు.

ఆఫీసువాళ్లిచ్చే ఎల్.టి.సి. డబ్బులుంటే మీకు పుస్తకాలకో, ప్రాజెక్టు ఖర్చులకో వస్తాయి కదా అనుకున్నాం, ఆ రకంగాను కోరికలు తీరలేదు. ఇక అమ్మ సంగతి విను. మీ పుట్టిన రోజులకి మీకే బట్టలు, గిఫ్ట్‌లు. ఇన్నేళ్ల సర్వీసులో ఆమెకు బంగారపు వస్తువు ఒక్కటీ చేయించలేదు. తనూ అది కావాలి, ఇది కావాలని డిమాండ్ చేయలేదు. పెళ్లిలో పెద్దవాళ్లు పెట్టిన పట్టుచీర తప్ప నేను మరోటి కొనలేదు.

నీకూ, తమ్ముడికీ కట్నం రూపంలో వచ్చిన 10, 15 లక్షలు- పెళ్లి ఖర్చులు నీ చేత పెట్టించి, ఇచ్చింది ఇచ్చినట్లు మీ పేర్ల మీదే ఎఫ్.డి.లు వేసుకున్నారు. ఈ పని చేస్తున్నది మీరిద్దరే కాదు, నేటి యువతరమంతా ఇదే బాణీ. అమ్మ గురించీ, నా గురించీ, మీ చదువులకయిన భారీ ఖర్చుల గురించి... పాపం మీరేనాడూ ఆలోచించలేదు. బహుశా మీకు తీరిక లేదనుకుంటాను.

సరే, విను... నేను నిన్ను ఆ ఆరు లక్షలూ ఇమ్మంటున్నాను. అదీ వట్టినే కాదు. మన ఇల్లు క్రింద రెండు పోర్షన్లు, పైన ఒకే యూనిట్‌గా పై భాగం మొత్తం ఇంటి సైట్‌లో 50 శాతం వచ్చేటట్లు సేల్ డీడ్ రాసి నీకు ట్రాన్స్‌ఫర్ చేస్తాను. దీనివల్ల నాకేం లాభం అని అనుకుంటున్నావా? మా తదనంతరం ఇంటిలో నీకు మూడవ వంతు వస్తుంది. నేను సూచించే ఈ విధానం వలన నీకు సగం వెంటనే ఇల్లు వస్తుంది. అదిగాక క్రింది భాగంలో 3వ వంతు ఎటూ మా తదనంతరం వస్తుంది. ఈ రెండంత స్థల భవనం ఈరోజు మార్కెట్ రేటు ప్రకారం 40 లక్షలు. నీ దగ్గర అడుగుతున్నది కేవలం 6 లక్షలు.

ఈ ప్రతిపాదన నీకంగీకారమయితే వారం రోజుల్లో డబ్బుతో సహా ఇక్కడికి రా! అంగీకారం కాకపోతే రేపే ఫోన్‌లో చెప్పెయ్యి. ఏ రకమైన ఒత్తిడీ లేదు.

ఉమ ఉత్తరం చదవడం ముగించి గోపీకృష్ణ వైపు తిరిగి ఆశ్చర్యపోయింది.


ఏం చేద్దాం? గోపీ అడిగేడు.

ఆయన చెప్పింది న్యాయంగానే ఉందండీ. మన దగ్గర డబ్బూ ఉంది.

గాడిద గుడ్డేం కాదూ? తండ్రి దగ్గర డబ్బు పెట్టి భాగం కొనడమా? ఆయనెలాగూ ఇల్లు అమ్మలేడు, బ్రతికుండగా! పోయేక, సగం వాటా మనకెలాగూ వస్తుంది. ఈలోగా మనకీ దండగెందుకు? రేపే ఫోన్ చేసి చెప్పేస్తా.

మీ ఇష్టం... మీరు చెప్పిందీ నిజమేలెండి!

గోపీకృష్ణ మాట తప్పలేదు. మర్నాడే ఫోన్ చేశాడు.




సారీ నాన్నగారూ! నేనీమధ్యే రెండో ఎపార్ట్‌మెంట్ తీసుకున్నాను. నా దగ్గర డబ్బేం లేదు.

గోపీకృష్ణ తండ్రి మోహనరావు ఈ రిప్లై ఊహించిందే. వెంటనే పెద్దవాడికి రాసిన ఉత్తరం కాపీని రెండో కొడుకు వంశీకి పంపించేడు. ఇది అందడానికి ముందే వాళ్లిద్దరూ ఫోన్లో సంప్రదించుకున్నారు. ఉత్తరం అందిన మరుక్షణమే మోహనరావుకి వంశీ నుండి సమాధానం లభించింది, డబ్బు కాదు!

★★★

రెండు నెలలు గడిచిపోయాయి. మోహనరావు కొలీగ్ సత్యనారాయణ ఆయనింటికి వచ్చేడు.

మోహన్, వారం క్రిందట వస్తే మీ ఇల్లు తాళం వేసి ఉంది. ఎక్కడికి వెళ్లావు? అన్నట్టు కారు షెడ్డెప్పుడు కట్టించావు? కారూ కొత్తదిలానే ఉంది?

మన రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలు చూస్తున్నాం రా-

నేనూ, మీ వదినానూ. ఆల్టో కారు ఈమధ్యనే కొన్నారా!

ఈలోగా మోహనరావు భార్య రాజేశ్వరి కాఫీ కప్పులతో ప్రవేశించింది. బాగున్నారా? అంటూ కాఫీ అందించింది. ఆమె గెటప్‌లోనూ కొంత మార్పు, నగలూ కన్పించేయి. సత్యనారాయణ ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోలేదు.

ఈ దబ్బంతా ఎక్కడిది? రిటైరయ్యాక నీకెలా వచ్చిందో లెక్క కట్టింది నేనే కదా? మీ అల్లుడికిచ్చెయ్యగా నీకు మిగిలింది ఒక లక్ష...

కాఫీ తాగు, చెబుతాను. మనది ముప్పై యేళ్ల స్నేహం. నా గురించీ, నా ఆలోచనల గురించి నీకు అన్నీ తెలుసు అంటూ కొడుకులకి తను ఉత్తరాలు రాయడం, మొదలైన విషయాలన్నీ చెప్పాడు.

సత్యనారాయణ ఆశ్చర్యపోయేడు. మరి ఈ దబ్బెక్కడిది?

వస్తున్నా, అక్కడికే వస్తున్నా... ఈమధ్య మన దేశంలోకి ఒక కొత్త స్కీమ్, ముఖ్యంగా మనలాంటివాళ్లకు పనికివచ్చేది వచ్చింది. రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ స్కీమ్ అని బ్యాంకు వాళ్లు దీనికి పేరు పెట్టారు. 60 సంవత్సరాలు పైబడిన నాలాంటివారికి సొంత ఇంటిమీద 15 సంవత్సరాల పీరియడ్ మించకుండా ఇంటిమీద లోన్ ఇస్తారు. మార్కెట్ రేటు ప్రకారం ఇంటికి విలువ కట్టి, ఈ వాల్యూ లోపు మనకు కావల్సినంత లోన్ ఇస్తారు! ఈ లోన్‌ని భార్యాభర్తలు జీవించినంత కాలం తీర్చనక్కరలేదు. అంటే ఇంటిని మార్ట్‌గేజ్ చేసుకుని లోన్ ఇస్తారు. భార్యాభర్తల తదనంతరం, విల్లు ప్రకారం వారసులకి నోటీసు ఇస్తారు. వారసులు ఇంటిమీద ఉన్న లోన్ తీర్చేసి ఇంటిని తీసుకోవచ్చు. ఒకవేళ వారసులకి ఈ లోన్ బెడద వద్దనుకుంటే లోన్ ఇచ్చిన ఇన్‌స్టిట్యూషనే ఇల్లుని స్వాధీనం చేసుకుంటుంది.


మనలాంటి మధ్యతరగతి వాళ్లకు, ముఖ్యంగా పెన్షన్‌లెస్ ఉద్యోగులకు ఈ స్కీమ్ ఉపయోగపడుతుంది. ఇదో అయాచిత వరం. సర్వీసులో ఉండగా హౌస్ లోన్ తీసుకుని ఇల్లు కడతాం. మనం రిటైరయ్యే టైముకి దానికి మంచి మార్కెట్ రేటూ లభిస్తుంది. మామూలుగా అయితే, ఈ రేటు మనకేం లాభం? ఇల్లు అమ్మేస్తే సొంత గూడుండదు. ఎంత దబ్బున్నా జీవన సంధ్యలో సొంత ఇల్లు చాలా అవసరం కదా! ఇల్లు ఉంచుకుని దబ్బు పొందే మార్గం ఈ స్కీమ్‌లో ఉంది, బాగుంది కదూ!

ఈ రివర్స్ మార్ట్‌గేజ్ స్కీమ్‌ని ఈమధ్య బ్యాంకులు టేకప్ చేస్తున్నాయి. ఈ స్కీమ్ కింద నేను 20 లక్షల లోన్ తీసుకున్నాను. 3 లక్షలతో మారుతీ ఆల్టో కారు తీసుకుని, 2 లక్షలతో ఇంటిని సౌకర్యవంతం చేసుకున్నాను. మీ వదిన చిరకాల వాంఛ తీర్చడానికి 2 లక్షలతో నగలు, నా చిరకాల వాంఛ తీర్చుకోడానికి 1 లక్షతో పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే ట్రస్టు ఏర్పాటు చేశాను. క్రింద పక్క పోర్షన్ ఖాళీ చేయించి హోమ్ థియేటర్, సి.డి.లు, కిచెన్‌లో ఎక్విప్‌మెంట్ కింద 2 లక్షలు. మిగిలిన 10 లక్షల్లో 8 లక్షలు ఎఫ్.డి.లో వేసి, 2 లక్షలు సేవింగ్ బ్యాంక్ ఎకౌంట్‌లో పెట్టాను. ఈ దబ్బుతో ప్రతీ 3 నెలలకు ఒకసారి విహార యాత్రలతో పాటు పుణ్యక్షేత్ర దర్శనం, డ్రైవర్‌ని తీసుకుని కారులో వెళ్లి వస్తాం. మా తదనంతరం లోన్, వడ్డీ పోను మిగిలిన సొమ్ముని ట్రస్టుకు చెందేటట్టు విల్లు రాసేశాను కూడా!

వెరీగుడ్ రా మోహన్! నువ్వు చెప్పినట్టు ఈ ఇల్లు వారసులకివ్వడం అనేది అనాలోచిత చర్య. ఈ స్కీమూ, నీలాంటి తండ్రులూ... బాధ్యత చేపట్టని పిల్లలకో గుణపాఠం! నీకు నా హృదయపూర్వక అభినందనలు... అంటూ సంతోషంగా మోహనరావుకి షేక్‌హేండ్ ఇచ్చాడు సత్యనారాయణ.

-కొట్టి రామారావు (మచిలీపట్నం)

---



## ఆ మాట!

ఆ మాట ఇంకోసారి గనక అన్నావంటే, మర్యాదగా ఉండదు...

ఏం..ఏం చేస్తావేంటి?

ఏం చెయ్యాలో అదే చేస్తాను

అంటే.. కొడతావా? చంపుతావా?

కొడతానో, చంపుతానో. ఆ మాట మళ్లీ అన్నప్పుడు నీకే తెలుసుద్ది...

అంటాన్రా! ఒకసారి కాదు, వందసార్లంటాను

వందసార్లు అనేదాకా నీకు మాట్లాడే ఛాన్సిస్తానా? ఒక్కసారంటే చాలు, నీ పుచ్చె పుచ్చకాయలాగా తెగిపోవడానికి!

అంత మొనగాడివా? ఏదీ నా పుచ్చె తెగ్గొట్టు చూద్దాం!

మళ్లీ ఆ మాట అను చూద్దాం...

ఏం చేస్తావ్‌రా?

దమ్ముంటే మళ్లీ ఆ మాట అను చూద్దాం!

రేయ్...

నీ అరుపులకిక్కడెవరూ జడిసిపోరు!

ఆ పక్కనే నిల్చుని ఉన్న నాకు చాలా చిరాకు వేసింది. అసహనంగా వాచ్‌లోకి చూసుకున్నాను. బాప్‌రే బాప్! పదిహేను నిముషాలు గడిచిపోయాయ్. కాళ్లు కూడా గుంజుతున్నాయ్.

ఆ మాట! అసలది ఏ మాట? అది తెలిస్తే, వెళ్లిపోదామని నేను చూస్తుంటే! ఇంటిదగ్గర చాలా పనులున్నాయ్. ఇక వెళ్లిపోదామా అనుకున్నాను. కానీ ఏ మనిషైనా ఆశాజీవే కదా! అందుకే కదల్లేకపోయాను.

ఏం చేస్తావ్?

పళ్లు జలజలమని రాలగొడ్తాను.

ఏదీ కొట్టు చూద్దాం, ఎలా రాలుతాయో?

ఇప్పుడు కాదు... నువ్ గనక మళ్లీ ఆ మాట అంటే. అప్పుడు...

నువ్ అనమంటే నేను అనాలా? అనను. నాకు బుద్ధి పుట్టినప్పుడే అంటాను.

ఎప్పుడన్నా సరే... నేను నీ తాట ఒలిచేది మాత్రం ఖాయం!

ఓర్పుకైనా ఓ హద్దు ఉంటుంది కదా! ఛీ ఛీ... ఈ వెధవలు ఇంతే అనిపించింది నాకు. అదీగాక ఇంటిదగ్గర అర్జెంటు పనులున్నాయ్.

ఇంక నాలో సహనం పూర్తిగా చచ్చిపోయింది. ఎంతసేపు చూసినా ఇలా మాటా మాటా అనుకోవడమేగానీ ఆ మాటేదో వాడు అనేదీ లేదు, వీడు వాడ్ని తన్నేదీ లేదు. ఉత్త వేస్టుగాళ్లు. కాలం విలువ తెలియని పరమ మూర్ఖులు.

వాళ్ల గొడవకి కారణమైన ఆ మాట ఏదో వినేసి వెళ్లిపోదామంటే వాళ్లు చెప్పి చావరే! నాకు విసుగొచ్చేసింది. కాలం విలువ తెలిసినవాడిని గనుక మరొక్క అరగంట ఎదురుచూసి, అప్పటికీ ఆ మాటేదో తెలియకపోవడంతో వాళ్ల వైపు తిట్టుకుంటూ చూసి, నా దారిన నేను వెళ్లిపోయాను.

-కె.లక్ష్మీకాంతమ్మ (నెల్లూరు)